# ధర్మసాగర్‌లో విశేషమైన జపమాల, మహా అన్నదాన కార్యక్రమం

## - క్రీస్తు మార్గంలో నడవాలని ఫాదర్ జోజి బాబు పిలుపు





**హనుమకొండ బ్యూరో/అక్టోబర్25 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో శనివారం ఘనంగా ప్రత్యేక జపమాల ఆరాధన కార్యక్రమం, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్రైస్తవ భక్తుల ఆధ్యాత్మిక అభివృద్ధి, సమాజంలో సేవా భావం పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

సంఘ పెద్దలు కొట్టే శ్రీనివాస్, ప్రేమ్ రాజ్, నక్క సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జపమాల ప్రార్థనలో పాల్గొన్నారు. భక్తుల చేతుల్లో జపమాలలు , ప్రార్థనలతో మొత్తం ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. మేరి మాతా కరుణ చూపించు” అంటూ భక్తులు ఒక్కసారిగా గళం కలిపినప్పుడు, ఆ పరిసరాలు భక్తి ప్రబోధంతో మార్మోగాయి. ఈ సందర్భంగా విచారణ గురువులు



ఫాదర్ జోజి బాబు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడిచి, వినయంగా జీవించాలి. క్రీస్తు మనకు చూపించిన ప్రేమ, క్షమ, దయ అనే మూడు మూల విలువలను మన జీవితంలో ఆచరణలో పెట్టాలి. సమాజంలో పరస్పర సహకారం, సేవా భావం, ప్రేమ పంచే మనసు ఉండాలి. అప్పుడు మాత్రమే మనం నిజమైన భక్తులమవుతాం అని సూచించారు. భక్తి అంటే కేవలం ప్రార్థన మాత్రమే కాదు, మన సహజీవనంలో మానవత్వాన్ని ఆచరించడం కూడా భక్తే. దేవుడు ప్రతి ఒక్కరినీ ఒకే ప్రేమతో చూస్తాడు. అందువల్ల మనమూ ఇతరులపై ప్రేమ, కరుణ చూపడం ద్వారా దేవునికి చేరువ కావాలి” అన్నారు. జపమాల ప్రార్థన అనంతరం భక్తులు మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదం, భోజనం పంపిణీ చేశారు. పిల్లల నుండి పెద్దల దాకా అందరూ ఉత్సాహంగా పాల్గొని, ఈ ఆధ్యాత్మిక సమాగమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంఘ సభ్యులు, మహిళా భక్తులు, యువకులు, సీనియర్ పెద్దలు సహకరించారు. ఈ ప్రాంతం భక్తి, ఆత్మీయతతో నిండిపోయి పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గుడి సంఘ పెద్దలు పంతులు కమలాకర్ సిసిలియా గాయక బృందం తదితరులు పాల్గొన్నారు.

# డయల్ 100 ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలి





## -కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**హనుమకొండ బ్యూరో/, అక్టోబర్25 (జర్నలిస్ట్ వార్త):** డయల్ 100 ద్వారా అందే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయ సమావేశ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు.

కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షిస్తూ, వాటి పరిష్కారానికి కావలసిన చర్యలను తక్షణమే చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. పెండింగ్‌కు గల కారణాలను గుర్తించి, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### రౌడీషీటర్లపై నిఘా

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని కమిషనర్ సూచించారు. వారు స్థానికంగా లేనట్లయితే, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతంలోని పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. చోరీలు, గంజాయి విక్రయాలు వంటి నేరాల్లో పాల్గొనే వారిపై హిస్టరీ షీట్లు తెరవాలని ఆయన ఆదేశించారు.

### సైబర్ నేరాలపై కఠిన చర్యలు

సైబర్ నేరాల్లో బాధితులకు నష్టపోయిన సొమ్ము తిరిగి అందించడమే కాకుండా, నిందితులను తప్పక పట్టుకోవాలని కమిషనర్ సూచించారు. పోక్సో కేసుల్లో దర్యాప్తు నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు.

### రాత్రి పెట్రోలింగ్, ట్రాఫిక్ జరిమానాలు

రాత్రి సమయంలో ఎస్.ఐ స్థాయి అధికారులు తప్పనిసరిగా పెట్రోలింగ్ చేయాలని ఆయన ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసుల తరహాలోనే స్టేషన్ అధికారులు కూడా పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ జరిమానాలు వసూలు చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు.

### రికవరీ శాతం పెంచాలి

చోరీ కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టాలని, అవసరమైతే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. నిందితులు ఎక్కడ ఉన్నా అరెస్టు చేయగల ప్రణాళిక రూపొందించాలని ఆయన సూచించారు.

### సీసీ కెమెరాలు %-% ప్రజల భాగస్వామ్యం

పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రజల భాగస్వామ్యంతో జరగాలని, వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ అన్నారు. నిందితులకు కచ్చితంగా శిక్ష పడేలా దర్యాప్తు జరపాలని సూచించారు.

### స్టేషన్ లో శుభ్రత - శ్రమదానం తప్పనిసరి

పోలీస్ స్టేషన్లలో పచ్చదనం, పరిశుభ్రత కోసం ప్రతి శుక్రవారం శ్రమదానం నిర్వహించాలని కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వెస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఏఎస్పీ చేతన్ నితిన్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## -జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వర్ధన్నపేట/అక్టోబర్25(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమం కింద రైతులు సకాలంలో తమ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేలా అధికారులు చురుకుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. శనివారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద డి.ఆర్.ఓ విజయలక్ష్మితో కలిసి వర్ధన్నపేట తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి, భూభారతి అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందితో సమావేశమై దరఖాస్తుల పరిష్కార స్థితి గురించి ఆరా తీశారు. భూభారతి దరఖాస్తుల పరిశీలనలో జాప్యం లేకుండా, ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి స్పష్టమైన కారణాలు నమోదు చేయాలని ఆమె సూచించారు. సాదా బైనామా, పీఓటీ వంటి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోజువారీగా భూభారతి దరఖాస్తుల పురోగతిని పర్యవేక్షిస్తూ, రైతుల ఇబ్బందులు తక్షణమే పరిష్కరించాలన్నారు. అలాగే మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందించాలన్నారు. తదుపరి ఎంఎల్యస్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ు బియ్యం, నిత్యావసర సరుకులు సరైన నాణ్యత, సరైన బరువుతో అందుతున్నాయా అనే అంశాలపై విచారణ చేసి నివేదిక సమర్పించాలని డీఎస్ఓ, పౌర సరఫరాల డీఎం, తహసీల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ సాగర్, నాయబ్ తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 27న వైన్ షాప్ దరఖాస్తుదారులు ఎంట్రీ పాస్ తో హాజరు కావాలి

## .ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బాస్కర్ రావు



**స్టేషన్ ఘన్ పూర్/అక్టోబర్25 (జర్నలిస్ట్ వార్త) :** ఈ నెల 27న వైన్ షాప్ దరఖాస్తుదారులు జనగామ జిల్లాలో పెంబర్తి నందన గార్డెన్స్ లో ఆథరైజ్డ్ పర్సన్స్ వారి ఎంట్రీ పాస్ తో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బాస్కర్ రావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ జిల్లాలో వైన్ షాపుల కొరకు దరఖాస్తు చేసు కున్న అభ్యర్థులకు 27 సోమవారం రోజున నందన గార్డెన్స్, పెంబర్తి, హైదరాబాద్ రోడ్డు, జనగాం నందు హాజరు కావాలని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా నిర్వ హించడం జరుగుతుందని కావున దరఖాస్తుదారులు ఎంట్రీ పాస్ తో హాజరుకావాలనికోరారు. ఈకార్యక్రమం లో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# గోవిందు ప్రదీప్ వైద్య చికిత్సకు దాతలు సహకరించాలి

## ... దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వేడుకోలు

### .17 వేలు ఆర్థిక సహాయం అందజేసిన దాతలు



**స్టేషన్ ఘన్ పూర్/అక్టోబర్25 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గోవిందు ప్రదీప్ ప్రమాదవశాత్తు ఘన్పూర్ నుండి తాటికొండ కు వెళ్లు క్రాస్ రోడ్ వద్ద ఇటీవల యాక్సిడెంట్ అయింది. చికిత్స నిమిత్తం హనుమకొండ చక్రవర్తి హాస్పిటల్లో చేర్పించారు. కాళ్లు ఫ్యాక్చర్ అయినందున ఆరోగ్యశ్రీ కింద సర్జరీ చేశారు. మరో సర్జరీ చేయవలసి ఉందని, డాక్టర్ దానికి ఆరోగ్యశ్రీ పనిచేయదని,ఆ సర్జరీకి ఖర్చు 1,20,000 రూపాయలు అయితాయని డాక్టర్ చెప్పి నారని బాధితుని కుటుంబ సభ్యులు తెలిపారు. నిరు పేద కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమి కూడా లేని నిరుపేద కుటుంబానికి గ్రామస్తులందరూ ఇప్పటి వరకు 17 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించినారు. గ్రామంలో ఎవరికీ ఏ ఆపదైనా కులము, మత ము, బెదము లేకుండా ఎవ్వరికీ తోచినంతవారు ఆర్థిక ఆర్థిక సాయం చేస్తున్నారని, గ్రామస్తులందరూ కలిసి తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# కోటగడ్డ శివాలయంలో నాగుల చవితి రోజున నాగదేవత ప్రత్యక్షం

## -భక్తులు పూజలు.



**బయ్యారం/అక్టోబర్ 25( జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కోటగడ్డ పంచాయతీ పరిధిలో కాకతీయుల కాలం నాటి శివాలయం ఉంది. ప్రతి నాగుల చవితి రోజు నాగదేవతకు ఈ గుడిలో భక్తులు పాలు పోసి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. శనివారం నాగుల చవితి సందర్భంగా భక్తులు శివాలయంలో శివలింగం,శివుడికి పాలు పోసి పూజల చేసిన సందర్భంగా గుడిలోకి నాగుపాము ప్రత్యక్షమై భక్తులకు కనువిందు చేసింది. అక్కడికొచ్చిన నాగుపామును చూసి భక్తులు మొక్కులతో పూజించి తరించారు. పురాతన ఆలయంలో కాకతీయ రాజుల కాలం నుండి పూజలందుకుంటున్న భక్తుల కోరిన కోర్కెలు తీర్చుతాయనే నమ్మకంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో ఇక్కడికి వస్తారని ఆలయ అర్చకులు తెలిపారు.

# మండలంలో వైభవంగా నాగుల చవితి వేడుకలు



**బయ్యారం/అక్టోబర్ 25( జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండల కేంద్రంలోని శ్రీ కోదండరామ దేవాలయంలో కార్తీక మాస నాగుల చవితి సందర్భంగా జంట నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కృపతో నాగుల చవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు జంట నాగులకు పంచామృత అభిషేకలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనచార్యులు ఆలయం తరపున శాస్త్రోక్తంగా పూజలు చేసి,దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గాదె కృష్ణ రెడ్డి, సెక్రటరీ కొల్లా వెంకటేశ్వరరావు, వైఎస్ రెడ్డి,పుట్టకుంట సత్తి బాబు,తిరుపతి రావు, దూదిపాళ్ళ రాజేష్, పూసులూరి మాధవరావు, గరెపల్లి శ్రీనివాస్,లింగయ్య,మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు చట్టాల పై రైతులకు అవగాహన కలిగి ఉండాలి...

## వరంగల్ జిల్లా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్ర ప్రసన్న...




**వర్ధన్నపేట/అక్టోబర్ 25(జర్నలిస్ట్ వార్త):** రైతు చట్టాల పై రైతులకు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ జిల్లా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్ర ప్రసన్న అన్నారు. శనివారం వర్ధన్నపేట మండలంలోని, కట్రీ యాల గ్రామములో రైతు వేదిక నందు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ వారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్ర ప్రసన్న హాజరై రైతులకు పంట నష్టం,భూమి పట్టా దారు , ఇనామ్ భూములు, కౌలు రైతు చట్టాల పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో డిపెన్స్ కౌన్సిల్ మెంబర్ సురేష్,ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ శృతి,వర్ధన్నపేట తహిసిల్దర్ విజయ సాగర్, ఎ.ఓ విజయ్ కుమార్, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య,ఎస్సై సాయిబాబు,రైతులు పాల్గొన్నారు.

